శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాస రావు

- ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 5 : ప్రజలు గణేశ్ నవరాత్రులు, ఈద్-మిలాద్-ఉన్-నబీ, ఇతర పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ తోట శ్రీనివాస రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మత పెద్దలు, ప్రజలతో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండగలను ప్రజలందరూ ఘర్షణలకు చోటివ్వకుండా నిర్వహించుకోవాలన్నారు. మద్యం తాగి డ్యాన్స్ చేయడం, డీజేలు పెట్టడం నిషేధించినట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో వినాయక మండపాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు ఉండాలని, మండపాలను ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీపుల అనుమతి తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య పుకార్లను నమ్మొద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయకూడదని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే డయల్ 100కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గద్వాల ఇన్‌చార్జి సీఐ నాగేశ్వర్ రెడ్డి, శాంతినగర్ సీఐ టాటా బాబు, అలంపూర్ సీఐ రవి బాబు ఉన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీమ్స్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 5: మహిళల భద్రత కోసమే షీటీమ్స్ పనిచేస్తాయని, బాలికలు, మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో షీటీమ్స్, సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. షీటీమ్, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ రత్నం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, యాంటి ర్యాగింగ్, ఆత్మహత్యలు, సైబర్ క్రైమ్స్, టీ సేఫ్ అప్లికేషన్ , బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆపద సమయంలో విద్యార్థులకు రక్షణ కల్పించాలనే ధ్యేయంతోనే షీటీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపద సమయంలో డయల్ 100, షీటీమ్ 6303923211 వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేయాలన్నారు. మీ వివరాలను గోప్యంగా ఉంచి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత మహిళల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ సునీత, అధ్యాపకులు రవికుమార్, సీఐ నాగభూషణం, రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి, టౌన్ ఎస్సై రామరాజు, షీటీమ్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రమేశ్ ,కృష్ణ, విజయ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

జిల్లా వైద్యశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశలు

గద్వాల,సెప్టెంబర్ 5 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆశ కార్యకర్తలు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలైనా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనారోగ్యసమస్యలు ఉన్నప్పుడు సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పద్మమ్మతోపాటు కాంతమ్మ, విజయమ్మ, లత, సుజాత, మమత, అనసూయమ్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

పాన్‌గల్, సెప్టెంబర్ 5: వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై శ్రీనివాసులు యాదవ్ గురువారం ప్రకటనలో కోరారు. ఈనెల 7నుంచి ప్రారంభమయ్యే వినాయక ఉత్సవాలను గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు

- గద్వాల కలెక్టర్ సంతోష్
- ఉపాధ్యాయులకు ఘన సన్మానం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్

గద్వాలటౌన్, సెప్టెంబర్ 5 : విద్యార్థుల భవిష్యత్ సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని కలెక్టర్ సంతోష్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని సందర్భంగా జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేటి కాలంలో ఉపాధ్యాయులు నూతన టెక్నాలజీ ఉపయోగించి విద్యను అందించడం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐదు మంది విద్యార్థులను దత్తత తీసుకుని వాళ్లను ఉన్నతంగా తీర్చిదిద్దేబాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి వారి రంగాల్లో రాణించడానికి గురువులు ఉంటారన్నారు. ఉన్నతిగా రాణించడానికి గురువుల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, మార్కెట్ యార్డు చైర్మన్ హన్మంతు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌పై ఓరింటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సివిల్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు మంచి కోచింగ్ క్లాసులు అందిస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి డ్రగ్స్ వల్ల కలిగే దుష్పలితాలు, షీ టీం టీషర్టులు, ట్రాఫిక్ నియమాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కలందర్‌భాషా, ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, ఈడీ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

వలస కూలీ మృతి : కేసు నమోదు

ధరూరు, సెప్టెంబర్ 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సీడ్ పత్తి పనులకు వలస వచ్చిన కూలీ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని బూరెడ్డిపల్లి గ్రామానికి సీడ్ పనుల నిమిత్తం ఏపీలోని కర్నూల్ జిల్లా ఎమ్మిగ నూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన బోయ నర్సింహ(18) అతడి అన్నతోపాటు వలస వచ్చాడు. అయితే బుధవారం రాత్రి 9గంటలకు భోజనం చేసి పడుకున్న తర్వాత నిద్రలోనే మృతిచెందాడు. ఈ విషయంపై ఎవరిపై అనుమానం లేదని మృతుడి అన్న బోయ వీరేశ్ తెలిపాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 5 :రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళమృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం బుధవారం రాత్రి 10:30 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ బీచుపల్లి వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ నారింజ రంగు పూలడిజైన్ చీర, వంకాయ రంగు జాకెట్, వయస్సు 40 ఏండ్లు ఉంటుందని తెలిపారు. ఎవరైనా మహిళను గుర్తిస్తే ఎస్సై 8712670 2 82, 8712 525795కు సమాచారం అందించాలని కోరా రు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసునమోదు

గోపాల్‌పేట, సెప్టెంబర్ 5 : మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు..మండలంలోని జయన్నతిరుమలాపురం గ్రామానికి చెందిన జనిగ జానకి (26) గతనెల 26వ తేదీన కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికారు ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త రాములు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట, సెప్టెంబర్ 5 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన రేవల్లి సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్సై రాము కథనం మేరకు..ఏదుల మండలకేంద్రానికి చెందిన కేశవులు (55) అతడి కొడుకు మల్లేశ్‌తో కలిసి గురువారం ఉదయం బైక్‌పై నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి బయలుదేరారు. తిగిరి మధ్యాహ్నం గ్రామానికి వస్తుండగా, రేవల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద తల్పునూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వస్తున్న కేశవులు బైక్‌ను ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో కేశవులు గాయపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, చికిత్స కోసం అతడిని వనపర్తి దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డును బాగుచేయాలి

ఇటిక్యాల, సెప్టెంబర్ 5 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రం నుంచి చాగాపురం (రైల్వే స్టేషన్)కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్ఆండ్‌బీ ఈఈ ప్రగతి గురువారం రోడ్డును పరిశీలించారు. రోడ్డుపై చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనుల్లో భాగంగా వేసిన మట్టి వర్షానికి కొట్టుకోపోవడంతో గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారిందని గ్రావెల్ పరిచి ఇబ్బందులు కలగకుండా చూడాలని గుత్తేదారును సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ అజర్ మొద్దీన్, ఏఈ రాజేశ్వరి పీఆర్ఎఈ పాండురంగ ఉన్నారు.

అభివృద్ధి పనులకు స్థల పరిశీలన

పుష్కరఘాట్ పరిశీలిస్తున్న అధికారులు

అలంపూర్,సెప్టెంబర్ 5 : వివిధ ప్రాంతాల నుంచి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చేందుకు చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అధికారులు అవసరమైన స్థల పరిశీలన చేశారు. పుష్కరఘాట్ వద్ద స్నానం చేసిన తర్వాత భక్తులు బట్టలు మార్చుకోవడానికి పాత షెడ్ల స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు, కొత్త శౌచాలయం నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ సరస్వతి, ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోగులాంబ సన్నిధిలో డీసీసీబీ చైర్మన్

అలంపూర్ పట్టణంలోని జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం మహా బూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. వారితో పాటు పీఏసీసీఎస్ చైర్మన్లు గజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లో మెకానిక్ షాపు

సులభ్ కాంప్లెక్స్‌లో అక్రమంగా మెకానిక్ షాపు నిర్వహిస్తున్న దృశ్యం

- ఓ నాయకుడి అండదండలతో నిర్వహణ
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 5 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఇష్టానుసారంగా అక్రమించి యథేచ్ఛగా కబ్జాకు గురిచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ మార్గ్‌లో ప్రభుత్వం డబ్బులతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచకుండా ఆ రాజకీయ నాయకుడు తన అనుచరుడికి అప్పచెపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆ నాయకుడు కబ్జాకు గురిచేస్తే స్పందించాల్సిన మున్సిపల్ అధికారులు ఆ వైపే చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..

సులభ్ కాంప్లెక్స్‌లో అక్రమంగా ఓ షాపు నిర్వహిస్తున్న విషయం నాకు తెలియదు. ఒక వేళ ప్రైవేట్ వ్యక్తులు సులభ్ కాంప్లెక్స్‌ను అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..

-మున్సిపల్ కమిషనర్ దశరథం

స్నేహితుడి కుటుంబానికి చేయూత

- మానవత్వం చాటుకున్న బాల్యమిత్రులు

స్నేహితుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోటి స్నేహితులు

పెద్దమందడి, సెప్టెంబర్ 5: పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన కానపురం గోపి అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2003-04 ఏడాదిలో గోపితో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు గురువారం గ్రామానికి చేరుకొని గోపి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. బాధిత కుటుంబానికి స్నేహితులంతా కలిసి రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. అన్ని విధాలుగా గోపి కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు హామీ ఇచ్చారు. అదేవిధంగా గోపి చిన్న కూతురు పేరుమీద రూ.50వేలు డిపాజిట్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నక్కల సుజాత, ఇర్కిచెట్టి సుజాత, ఎం.వేణుయాదవ్, కన్నె నర్సింహ, ఏ.తిరుపతయ్య, విష్ణు, నాగేశ్వర్ , రాఘవ, హరినాథ్, ఆంజనేయులు, సత్యనారాయణ, రామకృష్ణ, నాగరాజు, ధర్మేందర్, శ్రీనివాస్, రాఘవేంద్ర, కార్తీక్‌గౌడ్, మన్నెంకొండ, నరేశ్, కిశోర్, మహేశ్, బాలకృష్ణ, కురుమూర్తి, నాగార్జున, ఇస్మాయిల్, రాకేశ్, శ్రీను ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను త్వరగా సిద్ధం చేయాలి

ట్రాన్స్‌జెండర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 5: ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను త్వరగా సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం వనపర్తి ప్రభుత్వ దవాఖానను సందర్శించిన అదనపు కలెక్టర్ ట్రాన్స్ జెండర్ యూనిట్‌ను పరిశీలించారు. నిబంధనల ప్రకారం క్లినిక్‌ను సిద్ధం చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రంగారావు, వైద్యులు ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ , సెప్టెంబర్ 5 : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలో ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల్లో గురువారం గురు పూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవంపై విద్యార్థులకు ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వపరిపాలన దినోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయా మండలాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను ఎంఈవోలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అలాగే ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి అయిజ పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో టీజేఏసీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తకోటలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నేతలు

పెబ్బేరు చెంచువాడ పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రవల్లి పదోపటాలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

ఉండవెల్లిలో మండల స్థాయి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అవకతవకలు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 5 : ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఎస్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాటి లక్ష్మణ్ గురువారం ప్రకటనలో విమర్శించారు. ప్రతి సబ్జెక్ట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరి సెలెక్ట్ చేస్తే మ్యాథ్స్‌లో మాత్రం ముగ్గురిని తీసుకోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. కమిటీలో ఉన్న వారికి ఆప్తమిత్రుడు కోసమే గణితంలో ఒకరిని ఎక్కువగా తీసుకున్నారని ఆరోపించారు. ప్రైమరీ స్కూల్ హెచ్ఎం అవార్డులో సీనియర్‌ను కాదని జూనియర్‌ను ఎంపిక చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రాంతాల వారీగా తీసుకున్న తెలుగు సబ్జెక్ట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను మాత్రం అలంపూర్‌లో ఇద్దరిని ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. తెలుగు సబ్జెక్ట్‌లో గద్వాల నియోజకవర్గంలో ప్రతిభావంతులు ఎవరూ లేరా అని ప్రశ్నించారు. అన్ని అర్హతలు కలిగిన సీనియర్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులను పక్కన పెట్టి కొంతమంది జూనియర్ ఎస్‌జీటీలను ఎంపిక చేశారని, దీంతో సీనియర్ ఉపాధ్యాయులు మనస్తాపానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ అదర్శంగా ఉండాల్సిన ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలో జిల్లా సెలక్షన్ కమిటీ వైఫల్యమైనట్లు విచారం వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

వడ్డేపల్లి, సెప్టెంబర్ 5 : శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రామ ఓబులేసు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆంగ్లం-1, తెలుగు-1, బోటని-1, జూవాలజీ-1, కెమిస్ట్రి-1 బోధించేందుకు జిల్లాకేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వతేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హులు 9వ తేదీ మధ్యాహ్నం 2గంటల్లోగా శాంతినగర్‌లోని కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న మాజీ సర్పంచ్

మల్దకల్ రెవెన్యూ కార్యాలయంలో తాసీల్దార్‌కు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న జయమ్మనారాయణ

మల్దకల్, సెప్టెంబర్ 5 : గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కొత్తింటి జయమ్మనారాయణ పోటీ చేశారు. ఎన్నికల్లో గెలిస్తే గ్రామానికి అవసరమైన వైకుంఠధామానికి సొంత డబ్బులతో 2ఎకరాలు స్థలం కొని అందజేస్తానని ప్రజలకు వాగ్దానం చేశాడు. గెలుపొందిన తర్వాత గ్రామానికి చెందిన రైతుతో గ్రామానికి అవసరమైన శ్మశాన వాటికకు 2 ఎకరాల15 గంటల భూమిని కొనుగోలు చేశాడు. దానిలోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వహయంలో వైకుంఠధామం నిర్మించాడు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం రెవెన్యూ కార్యాలయంలో తాసీల్దార్ సమక్షంలో భూమిని గ్రామ పంచాయతీ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. =అనంతరం వాటి పత్రాలను గ్రామ కార్యదర్శికి అందజేశాడు. ఇచ్చిన మాటనిలబెట్టుకున్న మాజీ సర్పంచ్ కొత్తింటి జయమ్మనారాయణను మాజీ వైస్ ఎంపీపీ పెద్ద వీరన్నతో పాటు మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు కార్యకర్తలు, నాయకులు వారిని అభినందించారు.

సద్వినియోగం చేసుకోవాలి

మదనాపురం, సెప్టెంబర్ 5 : వ్యవసాయ డ్రోన్‌లపై మదనాపురం కేవీకేలో ఐదురోజుల పాటు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే యాంత్రీకరణ విభాగం శాస్త్రవేత్త మస్తానయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. డ్రోన్లతో పాటుగా సస్యరక్షణ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత ఫోన్ నెంబర్ 8978433314ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వడ్డెర సంఘం మండల కమిటీ ఎన్నిక

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 5 : వడ్డెర సంఘం మండల కమిటీని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అధ్యక్షతన గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఓర్సు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా సంపంగి లోకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లెపు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులుగా సంపంగి రాములు, వెంకటరాములు, కోశాధికారిగా దాసర్ల మల్లేశ్, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, మహిళా కన్వీనర్‌గా దాసర్ల శ్రీవల్లి, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, దాసర్ల శ్రీరాములు, రాజు, లోకయ్య, సహాయ కార్యదర్శిగా శాంతయ్య, సత్యనారాయణ, మన్నెం, యువజన అధ్యక్షుడిగా మల్లెపు రవీందర్, సలహాదారులుగా శ్రీను, రామస్వామి, ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ వడ్డెర సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, వడ్డెర హక్కుల సాధనలో ముందువరుసలో ఉండి పోరాడుతూ హక్కులను సాధించడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నేతలు, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 5: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం వనపర్తి జిల్లా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ సపోర్ట్ పర్సన్ నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో చిన్నపిల్లలు, విద్యార్థినులపై జరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హత్యాచారం, లైంగిక వేధింపులకు గురైన బాలికలకు ఒకే గొడుగు కింద అన్ని రకాల సేవలు అందిస్త